

చెరువులకు జలకళ..

నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని చెరువులు, కుంటలు, వాగులు జలకళ సంతరించుకున్నాయి. 8లో



'ఆశ్రమ' విద్యార్థిపై దాడి!

బూర్గంపాడు మండలం ఉప్పుసాక ఆశ్రమ బాలుర పాఠశాలలో విద్యార్థిపై దాడి ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
31° / 25°

జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి మూలమూర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణ ధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘటాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

7న రామాలయ ద్వారాలు మూత

భద్రాచలంటౌన్: చంద్రగ్రహణం సందర్భంగా సెప్టెంబర్ 7న మధ్యాహ్నం వరకే శ్రీ సీతారామచంద్ర స్వామివారి దర్శనం ఉంటుందని ఈఓ కె.దామోదర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం ఒంటిగంటకు ఆలయ ద్వారాలు మూసి తిరిగి సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు తెరుస్తామని పేర్కొన్నారు. సుప్రభాతం, ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, ఆరాధన, సేవాకాలం, నివేదన తరువాత ఉదయం 7.30 గంటలకు దర్శనాలు ప్రారంభమవుతాయని వివరించారు.

సింగరేణి ఈఅండ్‌ఎం డైరెక్టర్‌గా తిరుమలరావు



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఈఅండ్‌ఎం(ఎలక్ట్రికల్ అండ్ మెకానిక్) డైరెక్టర్‌గా మోకాళ్ల తిరుమలరావును నియమిస్తూ యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ పోస్టుకు నలుగురు జీఎంలు(పాలపాటి ఎలీషా, మోకాళ్ల తిరుమలరావు, కొండారెడ్డి శ్రీనివాసులు, ఎం.రామనాథం) పోటీ పడగా సెలక్షన్ కమిటీ సభ్యులు తిరుమలరావును ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆయన కార్పొరేట్ సీహెచ్‌పీ జీఎంగా విధులు నిర్వహిస్తున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


దుమ్ముగూడెం : చిత్రాలను పరిశీలిస్తున్న పీఓ, అధికారులు

భద్రాచలంటౌన్/దుమ్ముగూడెం : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ శనివారం హైదరాబాద్ నుంచి వీసీ నిర్వహించగా జిల్లా నుంచి రాహుల్ పాల్గొని మాట్లాడారు. అన్ని పాఠశాలల్లో సౌకర్యాలు సమకూర్చామని, విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను పరిరక్షించేలా వైద్యాధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామని వివరించారు. వరదలతో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే సమాచారం అందించేందుకు కంట్రోల్ రూమ్, హెల్ప్‌లైన్ డెస్క్ ఏర్పాటు చేశామని చెప్పారు. అనంతరం దుమ్ముగూడెం మండలం రేగుబల్లి ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటుచేసిన టీఎల్‌ఎం మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భద్రాచలం డివిజన్‌లోని 81 పాఠశాలల్లో 101 మంది టీచర్లు.. విద్యార్థులకు బేసిక్స్ సులభంగా అర్థమయ్యేలా చిత్రాలు రూపొందించడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి మేళాల ద్వారా ఉపాధ్యాయుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీఓ జనరల్ జనరల్ డేవిడ్ రాజ్, డీడీ మణెమ్మ, ఏసీఎంఓ రమేష్, ఆర్సీఓ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

అడవుల అభివృద్ధే ధ్యేయం

డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్


నర్సరీని పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్

జూలూరుపాడు: అడవులను అభివృద్ధి చేయడమే ధ్యేయమని డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్ అన్నారు. శనివారం ఆయన జూలూరుపాడు అటవీ నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అడవుల ఆక్రమణల నివారణ, వన్యప్రాణుల సంరక్షణ కోసం నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని సూచించారు. ఎఫ్‌ఆర్‌ఓ ప్రసాదరావు మాట్లాడుతూ.. ఈ ఏడాది నర్సరీలో టేకు, వెదురు, శ్రీగంధం తదితర 1,07,500 మొక్కలు పెంచామని, అడవుల్లో ప్లాంటేషన్‌కు 85 వేల మొక్కలు నాటామని, మరో 24,500 మొక్కలు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో అటవీ సెక్షన్ అధికారి హనుమంతు, ఎఫ్‌బీఓ బి. నరసింహారావు పాల్గొన్నారు.

పోరుకు సన్నద్ధం



'స్థానిక' ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- సిద్ధంగా ఉన్నామంటూ రాష్ట్ర ఈసీకి లేఖ
- ఈసారి రెండు విడతల్లో పోలింగ్ నిర్వహణ
- స్థానిక రిజర్వేషన్లపై నెలకొన్న అయోమయం

గ్రామపంచాయతీలు	471
వార్డులు	4,168
పోలింగ్ కేంద్రాలు	4,242
జెడ్పీటీసీ స్థానాలు	22
ఎంపీటీసీ స్థానాలు	233
ప్రస్తుతం గ్రామీణ ఓటర్లు	6,69,024

చుంచుపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. సెప్టెంబర్‌లో ఎన్నికలకు సిద్ధమంటూ కేబినెట్ ఆమోదం తెలపగా.. ప్రభుత్వం రాష్ట్ర ఎన్నికల సంఘానికి శనివారం లేఖ అందించింది. దీంతో వచ్చే నెలలో స్థానిక ఎన్నికల నగారా మోగనుంది. అటు పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును కూడా ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి రిజర్వేషన్ల అంశంలో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. గతేడాది లోక్‌సభ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థలకూ పోలింగ్ జరుగుతుందని భావించినా.. రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేయలేదు. ఇప్పుడు ఈసీకి లేఖ అందించడంతో మొదట జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు, ఆ తర్వాత గ్రామ పంచాయతీలకు రెండు విడతలుగా ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలుకానుంది. అయితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై ఆశావాహుల్లో కొంత అయోమయం నెలకొంది.

రెండు విడతల్లో ఎన్నికలు..

ఈసారి స్థానిక ఎన్నికల పోలింగ్‌ను రెండు విడతల్లో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. 2019లో జరిగిన గ్రామ పంచాయతీ, పరిషత్ ఎన్నికలను రెవెన్యూ డివిజన్ల వారీగా మూడు విడతల్లో నిర్వహించిన విషయం తెలిసిందే. దీన్ని ప్రస్తుతం మార్పు చేస్తూ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా రెండు విడతల్లో ఎన్నికల నిర్వహణకు ప్రణాళిక తయారు చేశారు. జిల్లాలో తొలివిడతలో అశ్వాపురం, భద్రాచలం, బూర్గంపాడు, చర్ల, దుమ్ముగూడెం, కరకగూడెం, మణుగూరు, పినపాక, ఆళ్లపల్లి, టేకులపల్లి, ఇల్లెందు, గుండాల మండలాల్లో, మలి విడతలో చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు, పాల్వంచ, దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి, చంద్రుగొండ,అన్నపురెడ్డిపల్లి మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు.

బ్యాలెట్ పేపర్లు, బాక్సులు రెడీ..

ఇప్పటికే ఓటరు జాబితా, బ్యాలెట్ పెట్టెలు, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, సిబ్బంది, నోడల్ అధికారుల నియామకం పూర్తి చేశారు. జిల్లాలో ఉన్న బ్యాలెట్ బాక్సులతో పాటు గతంలో కర్ణాటక నుంచి మరికొన్నింటిని తెప్పించిన విషయం తెలిసిందే. ఎన్నికల నిమిత్తం జంబో బాక్సులు 1,811, మీడియం బాక్సులు 351 అందుబాటులో ఉన్నాయి. ఇవి కాకుండా మరో 1,000 బాక్సులు అదనంగా తెప్పించనున్నారు. జిల్లాలో ఎన్నికలు జరిగే 471 గ్రామ పంచాయతీల్లో 4,168 వార్డులు ఉన్నాయి. ఇక జెడ్పీటీసీ స్థానాలు 22, ఎంపీటీసీ స్థానాలు 233 ఉన్నాయి. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సర్పంచ్ అభ్యర్థులకు గులాబీ రంగు, వార్డు సభ్యులకు తెలుపు రంగు బ్యాలెట్ పేపర్లు ముద్రించి స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచారు. పంచాయతీ ఎన్నికలకు10,223 మంది, పరిషత్ ఎన్నికలకు 8,711 మంది సిబ్బంది అవసరమని అధికారులు గుర్తించారు. పంచాయతీ ఎన్నికలకు 4,242, పరిషత్‌లకు 1,271 పోలింగ్ కేంద్రాలను అందుబాటులో ఉంచారు.

షెడ్యూల్ ఎప్పుడొచ్చినా సిద్ధమే



రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి ఎప్పుడు ఆదేశాలు వచ్చినా పోలింగ్ నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం. ఈసారి రెండు విడతల్లో పరిషత్ ఎన్నికలు నిర్వహించేలా ప్రతిపాదనలు చేశాం. జిల్లాలోని 22 జెడ్పీటీసీ, 233 ఎంపీటీసీ స్థానాల్లో ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నాం. -బి.నాగలక్ష్మి, జెడ్పీ సీఈఓ

'సీతారామ' పంప్‌హౌస్ సందర్శన

అశ్వాపురం: మండలంలోని బీజీ కొత్తూరులో సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్‌తో పాటు కెనాల్, దుమ్ముగూడెం ఆనకట్ట, మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను నీటిపారుదల శాఖ ఎస్‌ఈ నరసింహారావు శనివారం పరిశీలించారు. అనంతరం నీటిపారుదల శాఖ, సీతారామ ప్రాజెక్ట్ అధికారులతో సమీక్షించారు. ఆయన వెంట ఈఈ వెంకటేశ్వరరావు, డీఈలు రమేష్, శ్రీనివాస్, నిర్మాణ సంస్థ ప్రతినిధి రాజు తదితరులు ఉన్నారు. కాగా, మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు త్వరగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి తదితరులు ఎస్‌ఈ నరసింహారావుకు వినతిపత్రం అందజేశారు.

కేటీఆర్ పర్యటన విజయవంతం చేయండి

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా


అశ్వారావుపేటలో మాట్లాడుతున్న రేగా కాంతారావు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/అశ్వారావుపేటరూరల్ : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెప్టెంబర్ 10, 11 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు శ్రేణులకు పిలుపునిచ్చారు. కొత్తగూడెం, అశ్వారావుపేటలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కేటీఆర్ పర్యటనతో జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా రైతులకు సరిపడా యూరియా అందించలేకపోతున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఎప్పుడూ ఎరువుల కొరత రాలేదని, విద్యుత్ కోతలు లేవని అన్నారు. కేసీఆర్ పాలనలో 30 జిల్లాలకు 30 మెడికల్ కళాశాలలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేసిందని, కాంగ్రెస్ హయాంలో ఆయా స్కూళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం కూడా అందించడం లేదని విమర్శించారు. ఆయా సమావేశాల్లో మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, సోయం లక్ష్మి, మందపాటి మోహన్‌రెడ్డి, యూఎస్ ప్రకాశ్‌రావు, సున్నం నాగమణి, వగ్గెల పూజ, సంకా ప్రసాద్, సంపూర్ణ, కాసాని చంద్రం, వెంకన్న, నారం రాజశేఖర్ పాల్గొన్నారు.

అదే వరుస.. తీరని గోస


చంద్రుగొండ : యూరియా కోసం బారులుదీరిన రైతులు

యూరియా కోసం రైతుల నిరీక్షణ

ఇల్లెందురూరల్/పినపాక/చంద్రుగొండ/మణుగూరుటౌన్ : ప్రస్తుతం అప్పుడప్పుడూ తెరపినిస్తూ కురుస్తున్న వర్షాలు సాగుకు అనుకూలంగా ఉండగా.. పంటలకు ఎరువులు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. మొక్కజొన్న, పత్తి, వరి పంటలకు యూరియా వేసే తరుణం కావడం, డిమాండ్‌కు సరిపడా సరఫరా లేకపోవడంతో ఆ ఎరువు కోసం ప్రతీ చోట రైతులు బారులుదీరుతున్నారు. తెల్లవారకముందే విక్రయ కేంద్రాల వద్దకు చేరుకుని, క్యూలో నిల్చునే ఓపిక లేక చెప్పులు, పట్టాదారు పాస్ పుస్తకాలను లైన్‌లో పెట్టి పక్కన కూర్చుంటున్నారు. జిల్లాలోని ఇల్లెందు, పినకపా, మణుగూరు, చంద్రుగొండ తదితర ప్రాంతాల్లో శనివారం కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. ఇల్లెందు మండలం కొమరారం కేంద్రానికి 450 బస్తాల యూరియా రాగా అంతకుమించిన సంఖ్యలో రైతులు రావడంతో ఉద్రిక్తతకు దారితీసింది. పినపాకలో గత మూడు రోజులుగా యూరియా ఇవ్వడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రుగొండ మండలం గానుగపాడులో శనివారం తెల్లవారకముందే భారీగా చేరుకున్న రైతులు క్యూలో నిల్చున్నా.. తమను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మణుగూరు మండలానికి 60 – 70 టన్నుల యూరియా రావాల్సి ఉండగా, 10 రోజులుగా దిగుమతి కాలేదు. శుక్రవారం 10 టన్నుల మేర వచ్చిందనే విషయం తెలుసుకున్న రైతులు శనివారం తెల్లవారుజామునే చెప్పులు క్యూలో పెట్టి నిరీక్షించారు. ఇప్పటికైనా తమ ఇక్కట్లు తొలగించి సరిపడా యూరియా సరఫరా చేయాలని కోరుతున్నారు.


ఇల్లెందురూరల్: క్యూలైన్‌లో పెట్టిన చెప్పులు

భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం ఇలా..



నిలకడగా గోదావరి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం శుక్రవారం ఒక్కసారిగా పెరిగి రాత్రి 11 గంటలకు 44.70 అడుగులకు చేరుకుంది. శనివారం తెల్లవారుజామున 4 గంటలకు 46.10 అడుగులు ఉండగా.. ఉదయం 6 గంటలకు 46.50, 9 గంటలకు 46.90, 11 గంటలకు 47.10 అడుగులుగా నమోదైంది. మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు 47.30, 3 నుంచి రాత్రి 7 గంటల వరకు 47.40 అడుగుల వద్ద నిలకడగా ప్రవహించింది. 8 గంటలకు స్వల్పంగా పెరిగి 47.50 అడుగులకు చేరుకుంది. ఆదివారం ఉదయం వరకు నిలకడగా ఉండి, మధ్యాహ్నం నుంచి నెమ్మదిగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అధికారిక వర్గాల సమాచారం. ఎగువ ప్రాంతాల్లో భారీగానే నీరు ఉన్నప్పటికీ ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో డ్యామ్‌ల వద్ద గేట్లు మూసి ఉంచారు. రానున్న రెండు, మూడు రోజుల్లో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మళ్లీ పెరిగే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది.

అప్రమత్తం చేసిన అధికారులు..

భద్రాచలం వద్ద శుక్రవారం రాత్రి 7:22 నిమిషాలకు గోదావరి నీటిమట్టం 43 అడుగులు దాటడంతో అధి కారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఇప్పటికే నది ఒడ్డున ఉన్న స్లూయిస్‌ల వద్ద భారీ మోటార్లను సిద్ధం చేసి ఉంచారు. అలాగే, వరద ప్రభావిత ప్రాంత ప్రజల కోసం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం, ఐటీడీఏ కార్యాలయంతో పాటు కలెక్టర్ కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. వరద ప్రభావిత ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండి వరద నీరు చేరే అవకాశం ఉంటే ముందస్తుగా సమాచారం అందించాలని అధికారులు సూచిస్తున్నారు.

దివ్యాంగుల్లో సామర్థ్యాలను గుర్తించాలి

కలెక్టర్ జితేష్ వి. పాటిల్


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కొత్తగూడెంఅర్బన్: దివ్యాంగులు ప్రత్యేక సామర్థ్యాలు గలవారని, వాటిని గుర్తించి భవిష్యత్‌లో వారు రాణించేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. సమగ్ర శిక్ష, ఆలింకో ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మూడు రోజుల పాటు జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ దివ్యాంగుల శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం ఉచితంగా అందించే ఉపకరణాలు పొందాలని సూచించారు. జిల్లాలోని 17 మండలాల్లో దివ్యాంగులు విద్యనభ్యసించేలా భవిత కేంద్రాలు నిర్మించనున్నట్లు తెలిపారు. ట్రెయినీ కలెక్టర్ సౌరభ్ శర్మ మాట్లాడుతూ దివ్యాంగులు వైకల్యం ఉందని బాధపడకుండా సంకల్పంతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డీఈఓ బి.నాగలక్ష్మి, జిల్లా సమ్మిళిత విద్య కోఆర్డినేటర్, ఎస్‌కే సైదులు, ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎన్. సతీష్ కుమార్, అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ. నాగరాజశేఖర్, ఆలింకో డాక్టర్లు ప్రియా శర్మ, వికాస్, ప్రధానోపాధ్యాయులు మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

మేకల పెంపకాన్ని ప్రోత్సహించాలి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): గ్రామీణ ప్రాంతాల్లో మేకల పెంపకం, షెడ్ల నిర్వహణ, పశుగ్రాస ఉత్పత్తి తదితర అంశాలపై రైతులకు, పశువుల కాపరులకు అవగాహన కల్పించడంతో పాటు వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మేకల పెంపకం, మేకపాలు, ఉత్పత్తుల తయారీపై ఉత్తరప్రదేశ్‌లో శిక్షణ పొందిన ముగ్గురు పశు వైద్యాధికారులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. శాస్త్రీయ పద్ధతుల్లో మేకల పెంపకం, స్థానిక మేక జాతుల అభివృద్ధి, కృత్రిమ గర్భధారణ, మెరుగైన విత్తనపు పోతుల లభ్యత, పశుగ్రాస రకాలు, దాణా మిశ్రమ పదార్థాల లభ్యత, సమయానుకూల ఆరోగ్య పరిరక్షణ చర్యలు వంటి అంశాలపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. పైలట్ ప్రాజెక్టుగా ఒక గ్రామం నుంచి ఇద్దరు ఔత్సాహిక పశుపోషణ రైతులను ఎంపిక చేసి పై అంశాల అమలుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రామవరం, సారపాక, చంద్రుగొండ పశు వైద్య కేంద్రాల డాక్టర్లు జి. అనందరావు, సీహెచ్ బాలకృష్ణ, వి.సంతోష్ పాల్గొన్నారు.

వణికిస్తున్న జ్వరాలు..

జిల్లాలో విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

- ఆస్పత్రులకు పరుగుతీస్తున్న ప్రజలు
- చికిత్స, మందుల కోసం రూ.వేలల్లో ఖర్చు


భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

భద్రాచలంఅర్బన్: జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలాయి. ఇటీవల వైరల్ జ్వరాలు, టైఫాయిడ్, చికున్ గున్యా, డెంగీ తదితర వ్యాధులతో ప్రతీ ఇంట్లో ఇబ్బంది పడ్డారు. అయితే జిల్లాలో వైరల్ ఫీవర్లే ఎక్కువగా వ్యాప్తి చెందినా పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెంగీ బూచి చూపుతూ అడ్డగోలుగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక పరిసరాలు పరిశుభ్రంగా ఉంచకపోవడం, ఖాళీ స్థలాల యజమానులు వాటిలో పేరుకుపోయిన చెత్త, పిచ్చిమొక్కలు, నీటి నిల్వలు తొలగించకపోవడంతో దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులు ఎక్కువగా నమోదవుతున్నాయి. వీటిలో మలేరియా, డెంగీ కేసులు అధికం కాగా, ఎక్కువగా చిన్నారులే ఈ వ్యాధి బారిన పడుతున్నారు.

పెరుగుతున్న కేసులు..

జిల్లాలో వైరల్ జ్వరాలు, చికున్ గున్యా, టైఫాయిడ్, డెంగీ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. రెండు నెలల్లో పలు మండలాలు, గ్రామాల్లో పదుల సంఖ్యలో డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 70 డెంగీ, 54 మలేరియా, ఒక చికున్ గున్యా, 130 టైఫాయిడ్, 29,595 వైరల్ జ్వరాల కేసులు నమోదయ్యాయి. కాగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరుతున్న వారి వివరాలు నమోదు చేస్తుండగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరే వారి లెక్కలు తేలడం లేదు. ఆయా యాజమాన్యాలు జ్వర బాధితుల వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా వైద్యారోగ్య శాఖకు అందించకపోవడంతో జ్వరపీడితుల సంఖ్య స్పష్టంగా తెలియడం లేదు.

పర్యవేక్షణ లోపం..

జ్వరంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చేరగానే డెంగీ, ఇతర పరీక్షల పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ. 40 నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. ప్రతీరోజు ఒక్కో ఆస్పత్రికి 40 నుంచి 80 మందికి పైగా జ్వరంతో వస్తుండగా వారిలో ఆరు నుంచి 10 మందిని అడ్మిట్ చేసుకుంటున్నారు. అంతేకాక నిబంధనలకు విరుద్ధంగా థైరాయిడ్, డెంగీ, టైఫాయిడ్, మలేరియా తదితర టెస్టులు చేసి ఇష్టారాజ్యంగా డబ్బు వసూలు చేస్తున్నారు. డెంగీ కోసం ప్రత్యేకంగా ఎన్‌ఎస్–1, ఎలీసా టెస్ట్ చేయాల్సి ఉండగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో మాత్రం కేవలం ఎన్‌ఎస్–1 టెస్ట్ చేసి డెంగీ సోకిందంటూ ఆస్పత్రిలో చేర్చుకుంటున్నారు. డెంగీ రాకున్నా వచ్చినట్లు చూపించి ప్లేట్‌లెట్స్ (రక్త కణాలు) తగ్గాయంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇలా ఒక్కొక్కరిని నాలుగు రోజుల నుంచి ఆరు రోజుల వరకు ఆస్పత్రిలో ఉంచి రూ. 40 వేల నుంచి రూ. 50 వేల వరకు వసూలు చేస్తున్నారు.


కిటకిటలాడుతున్న ఏరియా ఆస్పత్రిలోని పిల్లల వార్డు


ముందుజాగ్రత్తలు తప్పనిసరి



వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. జబ్బుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు వృద్ధి చెందకుండా ఉండాలి. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ముందస్తు జాగ్రత్తలతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం. జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందాలి. పరిశుభ్రమైన వేడి ఆహారాన్నే తీసుకోవాలి.

– డాక్టర్ జయలక్ష్మి, డీఎంహెచ్‌ఓ

మా దృష్టికి వస్తే చర్యలు..



ప్రైవేట్ ఆస్పత్రుల్లో, ల్యాబ్‌ల్లో ఎన్‌ఎస్–1 టెస్ట్ మాత్రమే చేసి డెంగీ అని నిర్ధారించరాదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎలీసా టెస్ట్ చేశాక అందులో పాజిటివ్ వస్తేనే డెంగీ ఉన్నట్టు. అంతే తప్ప ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇష్టారాజ్యంగా టెస్ట్‌లు చేసి అడ్మిట్ చేసుకోవద్దు. ఇలాంటివి మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ చైతన్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, భద్రాచలం

క్లుప్తంగా

మొదలైన కేటీపీఎస్ సొసైటీ నామినేషన్లు



నామినేషన్లు సమర్పిస్తున్న ఉద్యోగులు

పాల్వంచ: కేటీపీఎస్ ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. స్థానిక కేటీపీఎస్ సెంట్రల్ ఆఫీస్ ప్రాంగణంలోని కోఆపరేటివ్ సొసై టీ కార్యాలయం వద్ద పోటాపోటీగా పలువురు ఉద్యోగులు డైరెక్టర్ పోస్టులకు నామినేషన్లు వేశారు. మొత్తం 3,003 ఓట్లకు గాను కేటీపీఎస్‌లో 2,106, బీటీపీఎస్‌లో 501, వైటీపీఎస్‌లో 396 ఓట్లు ఉన్నాయి. ఎన్నికల అధికారి జి. గంగాధర్, జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో మొత్తం 13 డైరెక్టర్ పోస్టులకు తొలిరోజు 23మంది అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పించారు. గత పాలకవర్గంలో ఉన్న డైరెక్టర్లు దానం నర్సింహారావు, మహేందర్, కేశులాల్‌నాయక్, ధర్మరాజుల నాగేశ్వరరావు సైతం మరోసారి నామినేషన్లు దాఖలు చేశారు. సోమ, మంగళవారాల్లో నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుంది. 1535, టీఆర్‌వీకేఎస్‌కు చెందిన అక్కెనపల్లి వెంకటేశ్వర్లు, బండి నాగరాజు, అల్లాడి పుల్లారావు, నారందాసు వెంకటేశ్వర్లు, రాసూరి శ్రీనివాస్, తోట అనిల్‌కుమార్ నామినేషన్లు వేశారు.

రిటైర్డ్ పోలీసులకు సన్మానం

కొత్తగూడెంటౌన్: పలు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఆరుగురు పోలీసులను ఎస్పీ రోహిత్‌రాజు శనివారం తన చాంబర్‌లో సన్మానించారు. సన్మానం పొందినవారిలో రామవరం టూటౌన్, అశ్వాపురం, లక్ష్మీదేవిపల్లి ఎస్‌ఐలు ఖాజా మక్బూద్ అలీఖాన్, కొత్తా నాగేశ్వరరావు, మందపల్లి ప్రసాద్, జూలురుపాడు, ఇల్లెందు ఏఎస్‌ఐలు కుక్కమళ్ల కోటేశ్వరరావు, చిన్న ధన్‌పాల్, ములకలపల్లి హెడ్ కానిస్టేబుల్ కన్నిడి వెంకటేశ్వర్లు ఉన్నారు. కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, ఏఓ మంజ్యానాయక్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవిపల్లి ఎస్‌ఐ రమణారెడ్డి, ఎంటీఓ సుధాకర్, అడ్మిన్ ఆర్‌ఐ లాల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి మహిళా కళాశాలలో వర్క్‌షాప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం కామర్స్ విభాగం ఆధ్వర్యంలో 'మోటివేషనల్ ఇన్నోవేషన్ సపోర్ట్ ట్రైనింగ్ ఫర్ యంగ్ ఉమెన్ ఎంపవర్‌మెంట్' అంశంపై ఒకరోజు రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కమతం శ్రీనివాస్, నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రమేశ్ హాజరై ప్రసంగించారు. వ్యాపారంలోని అడ్డంకులను ముందుగానే అంచనా వేసి జాగ్రత్తగా ముందుకు సాగితే విజయం సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ సీఎస్ వెంకటాచారి, కరస్పాండెంట్ జీకే కిరణ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ శారద మాట్లాడారు. కార్యక్రమంలో కామర్స్ హెచ్‌ఓడీ రజని, అధ్యాపకులు మాణిక్యాంబ, కృష్ణవేణి, శైలజ పాల్గొన్నారు.

పత్తిపంట ధ్వంసం

పాల్వంచరూరల్: మండలంలోని మందెరకలపాడు పంచాయతీ ఒంటిగుడిశ గ్రామానికి చెందిన గిరిజన రైతులు లక్ష్మయ్య, పాండు, నారాయణ, సింగు చాంతకొండ రేంజ్ పరిధిలోని బంగారుచెలక పత్తి సాగుచేశారు. ఈ పంటను శనివారం వైల్డ్‌లైఫ్ సిబ్బంది ధ్వంసం చేశారని బాధిత రైతులు తెలిపారు.

స్కూల్ బస్సును ఢీకొట్టిన లారీ

టేకులపల్లి: ఆగి ఉన్న స్కూల్ బస్సును వెనుక నుంచి బొగ్గు లారీ ఢీకొట్టిన ఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. రామవరంలోని బిల్డింగ్ బ్లాక్స్ హైస్కూల్‌కు చెందిన బస్సు పాఠశాలకు వస్తున్న క్రమంలో శనివారం టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ వద్ద విద్యార్థులను ఎక్కించుకుంటున్న సమయంలో టేకులపల్లి నుంచి వేగంగా వచ్చిన బొగ్గు లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. బస్సులోని ఓ చిన్నారికి స్వల్పంగా గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

నలుగురు జీఎంల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో వివిధ విభాగాలకు చెందిన నలుగురు జీఎంలను బదిలీ చేస్తూ కార్పొరేట్ ఈఈ సెల్ హెచ్‌ఓడీ మురళీధర్‌రావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం రీజియన్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ జీఎం దేబులాల్ బైద్యను నైనీ ఏరియా జీఎంగా, నైనీ ఏరియా జీఎం సంజయ్ మనోజ్ ముదార్‌ను రామగుండం రీజియన్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ జీఎంగా, కార్పొరేట్ ఎస్టేట్స్ జీఎం రాధాకృష్ణను మందమర్రి ఏరియా జీఎంగా, మణుగురు ఏరియా పీకేఓసీ ఏజీఎం టి. లక్ష్మీపతిగౌడ్‌ను కార్పొరేట్ ఎస్టేట్స్ హెచ్‌ఓడీగా బదిలీచేశారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.18,052

లక్ష్యానికి చేరలేక..



ఓసీ-4 గనిలో నిలిచిన వర్షపు నీరు

- ఓబీ వెలికితీతపై వర్ష ప్రభావం
- నెలలవారీగా బొగ్గు ఉత్పత్తిలో వెనుకంజ
- మణుగూరు ఏరియాలో 79 శాతమే ఉత్పత్తి

మణుగూరుటౌన్: వార్షిక బొగ్గు ఉత్పత్తి సాధనలో భాగంగా నెలల వారీగా నిర్దేశిత లక్ష్యాలు సాధించే అంశంలో ఎప్పుడూ ముందుండే మణుగూరు.. మూడు నెలలుగా కురుస్తున్న వర్షాలతో వెనుకబడింది. వర్షాలతో ఓబీ వెలికితీత, బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలుగుతోంది. అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి ఓబీ వెలికితీతకు, బొగ్గు ఉత్పత్తికి చర్యలు చేపడుతున్నా.. అడపాదడపా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షం కారణంగా ఒక్కో సారి గనుల్లోకి కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంటోంది. ఫలితంగా ఓబీ వెలికితీతలో వెనుకంజ, బొగ్గు ఉత్పత్తిలో నెలవారీ లక్ష్యాలను సాధించలేకపోతోంది.

ఈ ఏడాది ఆగస్టు వరకే అధికం

గతేడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు మాసం కంటే ఈ ఏడాది ఇప్పటివరకు కురిసిన వర్షమే అధికం. ఫలితంగా ఓబీ వెలికితీతలో వెనుకంజలో ఉన్నామని అధికారులు భావిస్తున్నారు. ఈ ఏడాది మణుగూరు ఏరియాలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 2,165 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, గతేడాది ఆగస్టు వరకు కురిసిన వర్షాని కంటే 18శాతం ఎక్కువ ఈ ఏడాది నమోదైంది. గతేడాది ఆగస్టు వరకు 49.88 లక్షల టన్నులకు గాను 46.49 లక్షల టన్నులు 93 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించింది. ఓబీ వెలికితీతలో 66 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 48.61 లక్షల క్యూబిక్ మీటర్లు వెలికితీసి 74 శాతం సాధించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 44.18 లక్షల టన్నులకు గాను 45.32 బొగ్గు ఉత్పత్తి సాధించి 103 శాతం నమోదైంది. అయితే, నెలవారీగా లక్ష్యాలకు వర్షం ఆటంకం ఏర్పడినా ఇది స్టాక్ కోల్ వల్లే సాధ్యమైందని అధికార వర్గాలు చర్చించుకుంటున్నాయి. నెలల వారీగా నిర్దేశించిన ఓబీ వెలికితీత లక్ష్యాల సాధనలో ఏప్రిల్‌లో 89 శాతం ఓబీ వెలికితీయగా, మే నెలలో 81 శాతం, జూన్‌లో 86.9 శాతం, జూలైలో 60 శాతం, ఆగస్టులో 76 శాతం మాత్రమే వెలికితీశారు.

ఏరియా వెనుకంజ

మణుగూరుఏరియాలో ఆగస్టులో 7.58 లక్షల టన్నుల బొగ్గుకు గాను 5.58 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి(77శాతం) నమోదైందని జీఎం దుర్గం రాంచందర్ తెలిపారు. ఆయన శనివారం వివరాలు వెల్లడిస్తూ.. తీవ్ర వర్షప్రభావంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోయామని చెప్పారు. ఆగస్టులో 614 మి.మీ.వర్షపాతంతో 12 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీతకు గాను 9.10 లక్షల క్యూబిక్ మీటర్లు వెలికితీశామన్నారు. మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాల ద్వారా ఉత్పత్తివ్యయం తగ్గింపు, నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిపై కార్మికుల్లో అవగాహన కల్పిస్తున్నామని, యంత్రాల వినియోగం పెంచి లక్ష్యాలను సాధిస్తామని తెలిపారు. సమావేశంలో అధికారులు రమేశ్, శివప్రసాద్, రాంబాబు, శ్రీనివాస్, వీరభద్రం, రమేశ్, జ్యోతిర్మయి పాల్గొన్నారు.



అలుగు పోస్తున్న పూసుగూడెం వద్ద తెల్లవాగు చెరువు

చెరువులకు జలకళ..



వెంకమ్మ చెరువు కింద సాగు చేస్తున్న వరి

పాల్వంచరూరల్/అశ్వారావుపేటరూరల్: గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలు, వాగుల్లోకి వరద నీరు చేరుతుండగా అన్నీ జలకళ సంతరించుకున్నాయి. జిల్లాలో మొత్తం 2,364 చెరువులు ఉండగా 877 చెరువులు అలుగు పోస్తున్నాయి. మరో 1,487 చెరువుల్లో 75 నుంచి 100 శాతం మేర నీరు చేరింది. పాల్వంచ మండలం రేగులగూడెంలోని ఎర్రసాని చెరువు నిండగా, మందెరకలపాడు వద్దగల రాళ్లవాగు పికప్ డ్యామ్ అలుగుపోస్తోంది. కిన్నెరసాని వాగు, సోములగూడెం, సూరారం, నాగారం వద్ద నిర్మించిన చెక్ డ్యామ్‌లోకి వరదనీరు చేరగా పొంగిపొర్లుతున్నాయి. అశ్వారావుపేట నియోజకవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి, చండ్రుగొండ మండలాల్లో గల చిన్న కుంటలు, చెరువులతోపాటు ప్రాజెక్టుల్లో వరదనీరు చేరగా ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. జిల్లాలో అరకొరగా నిండిన చెరువుల కింద సాగుచేసిన రైతులు పంట పూర్తయ్యే వరకు సాగునీరు అందుతుందో లేదోననే కలత చెందుతున్న తరుణంలో ఇటీవలి వానలతో చెరువులన్నీ నిండుకుండల్లా మారాయి. దీంతో ఇక పంటలకు ఢోకా లేదని చెబుతున్నారు.

కిన్నెరసాని ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తివేత

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షానికి కిన్నెరసాని జలయాశానికి వరద ఉధృతి పెరిగింది. ఎగువ నుంచి 6,400 క్యూసెక్కుల వరదనీరు రావడంతో శనివారం మూడు గేట్లను ఎత్తివేసి 12వేల క్యూసెక్కుల నీటి ని గోదావరిలోకి విడుదల చేసినట్లు ఏఈ తెలిపారు.

అధ్వానం ఆశ్రమ పాఠశాల

టేకులపల్లి/సింగరేణి(కొత్తగూడెం): టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఆశ్రమ పాఠశాల అధ్వానంగా మారిందని, హాస్టల్ వార్డెన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ ఆరోపించారు. సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న విద్యార్థి పోరుబాట యాత్ర శుక్రవారం టేకులపల్లి మండలానికి చేరుకోగా శనివారం కోయగూడెం ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. హాస్టల్‌లో వెలుగుచూసిన సమస్యలను నాయకులు వెల్లడించారు. మరుగుదొడ్లు, వంట పాత్రలు, మంచినీటి ట్యాంకులు, విద్యార్థులు పడుకునే డార్మెంట్లు, డైనింగ్ హాల్, పాఠశాల ఆవరణం అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. కట్టెలతో వంటచేసి, గ్యాస్ బండలు వాడినట్లు బిల్లులు పెట్టుకుంటున్నారని ఆరోపించారు. రెగ్యులర్ వర్కర్ల స్థానంలో కూలీలను ఏర్పాటు చేసుకొని వర్కర్ల నుంచి కూలీల నుంచి కమీషన్లు తీసుకుంటున్నారని, దీనిపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం యాత్ర కొత్తగూడెం చేరుకోగా పృథ్వీ మాట్లాడుతూ.. కొత్తగూడెంలో మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు మునిగెల శివప్రశాంత్, బి.సాయికుమార్, రామ్‌చరణ్, అబ్దుల్ గని, విష్ణువర్ధన్, జార్జ్, శ్రావణి, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.



వంట కోసం నిల్వ ఉంచిన కర్రలను పరిశీలిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు



లక్ష్మీ గణపతి !

గణపతి నవరాత్రి వేడుకల్లో భాగంగా కొత్తగూడెం కూలీలైన్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఉత్సవ కమిటీ వారు శనివారం రూ.2.70 లక్షల కరెన్సీతో అలంకరించారు. కాగా, ఇక్కడ స్వామివారిని పలువురు భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

– కొత్తగూడెంటౌన్

ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిపై దాడి

ఐటీడీఏ పీఓ సందర్శించిన రోజే ఘటన

బూర్గంపాడు: మండలంలోని ఉప్పుసాక ఆశ్రమ బాలుర పాఠశాలలో విద్యార్థిపై దాడి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం.. ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న జూలూరుపాడు మండలం పాపకొల్లుకు చెందిన విద్యార్థిపై సారపాకకు చెందిన మరో విద్యార్థి మద్యం సేవించి దాడికి పాల్పడ్డాడు. ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్లు నిర్లక్ష్యంగా ఉండటంతో ఈ ఘటన చోటుచేసుకుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా రు. ఆశ్రమ పాఠశాలలో గణేశ్ మండపం ఏర్పా టు చేసుకోగా దానికి సంబంధించిన పూజా సామగ్రి నిమిత్తం పాఠశాల కంప్యూటర్ ఆపరేటర్, 10వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు శుక్రవా రం సాయంత్రం హెచ్‌ఎం అనుమతితో బయటకు వెళ్లారు. వారు పాల్వంచలో పూజా సామగ్రి తీసుకున్నాక విద్యార్థులు గుట్టుచప్పుడు కాకుండా మద్యం బాటిల్ కొనుగోలు చేసి పూజా సామగ్రి కవర్లో పెట్టి హాస్టల్‌కు చేరుకున్నారు. రాత్రి సమ యంలో గణేశ్ మండపం వద్ద అప్పటికే మద్యం సేవించి ఉన్న విద్యార్థి.. తోటివిద్యార్థి దుప్పటి కోసం రావడంతో దాడి చేశాడు. ఈ విషయాన్ని బాధిత విద్యార్థి వార్డెన్‌కు చెప్పడంతో ఆమె హెచ్‌ఎంకు సమాచారం అందించింది. హెచ్‌ఎం ఆరాతీయగా.. సదరు విద్యార్థి హాస్టల్ నుంచి వెళ్తానని చెప్పాడు. రాత్రి కాకుండా ఉదయం పంపుతానని హెచ్‌ఎం చెప్పడంతో ఆ విద్యార్థి వసతి గృహంలోనే ఉండి దాడి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపాడు. శనివారం ఉదయం దాడికి గురైన విద్యార్థి మేనమామ వసతిగృహం వద్దకు చేరుకోగా అప్పటికే పాఠశాలలో దాడిచేసిన విద్యార్థి తల్లిదండ్రులను పాఠశాలకు హెచ్‌ఎం పిలిపించినట్లు తెలిసింది. అయితే ఈ దాడి ఘటన విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల నిర్వాహకుల పనితీరును ప్రశ్నించేలా ఉంది. తమ పిల్లలు విద్యాబుద్ధులు నేర్చుకుంటారని వసతిగృహం, పాఠశాలకు పంపితే బయటకు అనుమతి లేకపోయినా ఎలా వెళ్తున్నారని, వారికేమైనా జరిగితే బాధ్యత ఎవరిదని మండిపడుతున్నారు. కాగా, భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ సదరు ఆశ్రమ పాఠశాలను సందర్శించి, వెళ్లిన రోజే ఈ ఘటన జరగడం గమనార్హం.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

వాగులో మునిగి గురుకుల కళాశాల వర్కర్ మృతి



మోహన్ మృతదేహం

గుండాల: గిరిజన గురుకుల పాఠశాలలో ప్రతిష్ఠించిన వినాయకుడిని నాలుగోరోజు నిమజ్జనం చేయగా.. ఆ వాగులోనే కళాశాల వర్కర్ మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలలో వినాయకుడిని ప్రతిష్ఠించారు. మూడు రాత్రుల అనంతరం వినాయకుడిని మల్లన్నవాగులో నిమజ్జనం చేసేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి వెళ్లారు. కాగా, కళాశాలలో డైలీవేజ్ వర్కర్(వంటమనిషి)గా పనిచేస్తున్న బానోత్ మోహన్ (35) కూడా వారితో పాటు వెళ్లాడు. నిమజ్జనం అయిన వెంటనే విద్యార్థులు, ఉపాధ్యాయులు వెనుతిరిగారు. ఓ ఉపాధ్యాయుడితోపాటు మోహన్ చెక్‌డ్యాం కింద స్నానం చేసేందుకు అక్కడే ఉండిపోయారు. మోహన్ వాగులోకి దిగి ఎంతకూ రాకపోవడంతో సదరు ఉపాధ్యాయుడు తోటి ఉపాధ్యాయులకు సమాచారం అందించాడు. అక్కడికి చేరుకున్న ఉపాధ్యాయులు వాగులో మృతదేహాన్ని బయటకు తీశారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు ఘటనా స్థలానికి చేరుకునేసరికి ప్రిన్సిపాల్ సురేశ్‌తో పాటు ఉపాధ్యాయులు వెళ్లిపోయారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గురుకుల పాఠశాల వద్దకు తీసుకెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. అయినా వినకుండా పాఠశాల వద్దకు తరలించి రెండు గంటలపాటు ధర్నా చేశారు.

అసలేం జరిగింది..?

నిమజ్జనం అనంతరం మృతుడితో పాటు ఉపాధ్యాయుడు అక్కడే ఎందుకు ఉండాల్సి వచ్చింది? స్నానానికి అని వాగులో దిగాడా? జారి పడ్డాడా? ఇంకేమైనా జరిగిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్కడి నుంచి ప్రిన్సిపాల్‌తో సహా ఉపాధ్యాయులు తప్పించుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది? భయపడి వెళ్లిపోయారా..? అసలింతవరకు వారి ఆచూకీ కూడా తెలియపోవడంతో అనుమానాలు బలపడుతున్నాయి. ఆందోళనకారులతో ఎస్‌ఐ సైదారవూఫ్ నచ్చజెప్పినా వినడం లేదు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బిడ్డకు జన్మనిచ్చిన మతిస్థిమితం లేని యువతి

కొన్నాళ్లుగా 'అన్నం' ఆశ్రమంలో ఆశ్రయం

ఖమ్మంఅర్బన్/దుమ్ముగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం నడికుడి గ్రామానికి చెందిన మానసిక స్థితి సరిగా లేని ఆదివాసీ యువతి మహాలక్ష్మి మగబిడ్డకు జన్మనిచ్చింది. పాడుబడిన గుడిసెలో నివసించే ఆమెకు తండ్రి బాలరాజు తప్ప తల్లి, తోబుట్టువులు ఎవరూ లేకపోగా కొద్దినెలల క్రితం గర్భం దాల్చినట్లు బయటపడింది. ఆమె సంరక్షణ ఎవరూ చూసుకునే పరిస్థితి లేకపోవడంతో భద్రాద్రి కొత్తగూడెం అధికారులు ఆశ్రయం కల్పించేందుకు ప్రయత్నించినా ఫలితం కానరాలేదు.

చివరకు ఈనెల 1వ తేదీన ఖమ్మంకు చెందిన అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు అంబులెన్స్‌లో మహాలక్ష్మి, ఆమె తండ్రిని తీసుకొచ్చి ఖమ్మంలోని తమ ఆశ్రమంలో వసతి కల్పించారు. అక్కడ పౌష్టికాహారం అందిస్తూ వైద్యం చేయించడమే కాక ఇటీవల సీమంతం కూడా నిర్వహించారు. శనివారం ఉదయం మహాలక్ష్మికి పురిటినొప్పులు రావడంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా సాధారణ ప్రసవం ద్వారా మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లీశిశువు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారని అన్నం శ్రీనివాసరావు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

ఇల్లెందురూరల్: పురుగులమందు సేవించి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు శనివారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి.. గుండాల మండలం రేగులగూడెం గ్రామానికి చెందిన పొడుగు శ్రీరాం (27) రెండేళ్లుగా మండలంలోని బొజ్జాయిగూడెం జీపీ మొట్లగూడెం గ్రామంలో నివాసం ఉంటున్నాడు. మూడు రోజుల క్రితం భార్య సుజాతతో ఘర్షణ పడి క్షణికావేశంలో పురుగులమందు సేవించాడు. కుటుంబ సభ్యులు అతడిని ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు పోలీసులు కేసు నమోదు చేశారు.

అమ్మో ఆర్‌ఎంపీలు..

- ధనార్జన కోసం అడ్డదారులు
- కారు కిరాయి కోసం రిఫర్‌లు
- ఆపై కమీషన్లు కూడా..

అశ్వారావుపేట: పేరుకు గ్రామీణ వైద్యులం.. మారుమూల ప్రాంతాల్లో అత్యవసర సమయాల్లో అర్ధరాత్రి, అపరాత్రి అనే భేదం లేకుండా రోగుల ఇంటికి వెళ్లి ప్రాణాలు కాపాడతామంటూ కితాబులిచ్చుకునే ఆర్‌ఎంపీల్లో కొందరు వైద్య రంగానికే కళంకం తెస్తున్నారు. తాజాగా అశ్వారావుపేటకు చెందిన హసాన్ అనే యువకుడి ప్రాణాల మీదకు తెచ్చిన ఓ ఆర్‌ఎంపీ వ్యవహారం బయటపడటంతో ఇలాంటివారి లీలలు బయట పడుతున్నాయి. ఇదే ఆర్‌ఎంపీ అశ్వారావుపేట ఆనుకుని ఏపీలో ఉన్న కామయ్యపాలెంలో కూడా ఇలాగే ఓ వ్యక్తి ప్రాణాల మీదకు తెచ్చినట్లు తెలుస్తోంది. మధిర ప్రాంతం నుంచి ఈయన అశ్వారావుపేటకు ఇటీవలే వచ్చినట్లు తెలుస్తోంది. అమాయకులు.. నిరక్షరాస్యులు, మద్యం మత్తులో గ్యాస్, బీపీల బారిన పడి ఇంటి నుంచి బయటకు రాలేని వాళ్లే ఇతని టార్గెట్ అని తెలుస్తోంది. మద్యం సేవించిన వారు గ్యాస్, ఇతర ఇబ్బందులకు గురయినప్పుడు ఇంటికి వచ్చి ఇంజక్షన్లు చేసి, రూ.500 వసూలు చేయడం ఇతని దినచర్య. ఫోన్ చేస్తే వెంటనే కిట్ బ్యాగ్ తీసుకుని ఇంటికి రావడం.. నాలుగు సూదిపోట్లు పొడవటం.. రూ.500 వసూలు చేయడం. హసాన్‌కు కూడా గ్యాస్, కీళ్ల నొప్పి వస్తే ఇలాగే ఇంజక్షన్ చేయడంతో వైద్యం బెడిసికొట్టింది. వారు ఏలూరు వెళ్తుండగా వద్దని.. బలవంతంగా రోగితోపాటు కారెక్కి ఖమ్మం తీసుకువెళ్లినట్లు సమాచారం. శరీరంలో అంతర్గతంగా రక్తస్రావం అయ్యేలా ఔషధాలు అధిక మోతాదులో ఇచ్చాడని, అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామంటున్నారు. కాగా, అశ్వారావుపేట పరిసర ప్రాంతాల్లో ఆర్‌ఎంపీలది ఒక్కొకరిది ఒక్కో శైలి. కొందరు నాలుగైదు మంచాలు పెట్టి.. పక్కనే ఓ ల్యాబ్ ఏర్పాటు చేయించి.. సొంత ఫార్మసీని వేరే వ్యక్తుల పేర్లతో కలిగి ఉంటారు. వీరికి కారు కూడా ఉంటుంది. ఆ కారులో రోగులను ఖమ్మం తరలించి.. వైద్యుల నుంచి కమీషన్‌తోపాటు కారుకు కిరాయి కూడా దండుకుంటారు. అనధికారికంగా వీరు చేసే సర్జరీలు, అబార్షన్‌లు వెలుగులోకి రావు. అయితే, ప్రజల వైద్యులుగా.. గ్రామాల్లో ఆదరణ ఉన్న గ్రామీణ వైద్యులూ ఉన్నారు. కూరగాయలు, బియ్యం ఇస్తే మందుబిళ్లిచ్చే వారూ ఉన్నారు. ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసులు అర్హతకు మించి వైద్యం అందిస్తున్న ఆర్‌ఎంపీలపై దృష్టి సారించి కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ముంపు ప్రాంతాల నుంచి గర్భిణుల తరలింపు

భద్రాచలంఅర్బన్: గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల నుంచి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు 81 మంది గర్భిణులను తరలించారు. వారిలో 35 మంది గర్భిణులకు డెలివరీ చేశారు. ప్రసవం అయిన వారు డిశ్చార్జ్ కాగా, కొందరు లేబర్ వార్డులో చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉండగా ఏపీ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం నుంచి వచ్చిన గర్భిణులు ప్రసవించిన తరువాత కూడా ఏరియా ఆస్పత్రిలోనే ఉండాలని, ప్రస్తుతం గోదావరి వరద ఉధృతి ఉన్న క్రమంలో ఆ ప్రాంతవాసులను డిశ్చార్జ్ చేయొద్దని శనివారం అడిషనల్ డీఎంహెచ్‌ఓ సైదులు, భద్రాచలం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చైతన్య.. లేబర్ వార్డు సిబ్బందిని ఆదేశించారు. కాగా, తమను డిశ్చార్జ్ చేయాలని, వరద ఉన్నా నుడుచుకుంటూ వెళ్తామని చింతూరు ప్రాంత బాలింతలు చెబుతున్నారు. కాగా, ఎవరైనా ఆస్పత్రి సిబ్బందికి సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోతారేమననే అయోమయ స్థితిలో ప్రస్తుతం లేబర్ వార్డు సిబ్బంది ఉన్నారు.



చికిత్స పొందుతున్న గర్భిణులు

బాధ్యతగా నర్సరీల నిర్వహణ

బూర్గంపాడు: గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో చేపట్టిన నర్సరీలను బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌సౌరభ్‌శర్మ సూచించారు. సారపాక గ్రామపంచాయతీలోని నర్సరీని శనివారం ఆయన పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న మొ క్కల వివరాలను తెలుసుకున్నా రు. నాటిన మొక్కల సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని అధికారుల ను అడిగారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం తప్పనిసరి అని అన్నా రు. మొక్కలు పెంచి, వాటిని కచ్చితంగా నాటించి సంరక్షించాల్సిన బాధ్యత గ్రామపంచాయతీ కార్యదర్శులు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంపీఓ బాలయ్య, పంచాయతీ కార్యదర్శి మహేశ్ పాల్గొన్నారు.

బతికి ఉన్న కుమార్తెకు శ్రద్ధాంజలి

కులాంతర వివాహం చేసుకోవడంతో ఆవేదన

ఇల్లెందురూరల్: ప్రేమను మరచిపోలేని యువతి.. కులాంతర ప్రేమ వివాహం చేయలేని కుటుంబీకుల అశక్తత.. వెరసి కులాంతర వివాహం చేసుకున్న యువతి బతికి ఉండగానే శ్రద్ధాంజలి ఫ్లెక్సీలు కట్టిన ఘటన ఇది. ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం వాసి, యాదవ కులానికి చెందిన కొచ్చర్ల వెంకటేష్ కోయ యువతిని ప్రేమించాడు. వీరిద్దరికీ తండ్రులు లేకపోగా.. ప్రేమను పెద్దలు అంగీకరించరని భావించి వారం క్రితం పెళ్లి చేసుకున్నారు. ఆపై ఇల్లెందు పోలీసులను ఆశ్రయించడంతో కుటుంబీకులకు వారు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆపై నూతన దంపతులు గ్రామంలోని బంధువుల ఇంట్లో ఆశ్రయం తీసుకుంటుండగా.. వెంకటేష్‌పై పోలీసు కేసు ఉన్న విషయం తెలియడంతో యువతి తల్లి తన కుమారులతో కలిసి ఆమెకు నచ్చజెప్పి ఇంటికి తీసుకెళ్లారు. ఈమేరకు వెంకటేష్ ఫిర్యాదు చేయగా పోలీసులు యువతిని ప్రశ్నించడంతో తల్లితోనే ఉంటానని చెప్పింది. ఆపై వెంకటేష్ సూచనతో గ్రామ పెద్దమనిషి యువతిని తీసుకురాగా భర్తతోనే ఉంటానని వెల్లడించగా పోలీసులు అప్పగించారు. దీంతో యువతి తల్లి, సోదరులు ఆమె చనిపోయినట్లుగా పేర్కొంటూ శనివారం గ్రామంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

గిరిజన రైతు రిమాండ్

పాల్వంచరూరల్: అక్రమంగా పోడు సాగుచేసిన కేసులో గిరిజన రైతుకు కోర్టు 14 రోజులపాటు రిమాండ్ విధించింది. వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ బాబు కథనం ప్రకారం.. యానంబైల్ రేంజ్ పరిధిలోని మామిళ్లవాయికి చెందిన మడివి గంగయ్య ఇటీవల అక్రమంగా పోడు సాగు చేసినందుకు వైల్డ్‌లైఫ్ రేంజర్ కేసు నమోదు చేశారు. శనివారం కొత్తగూడెం కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధించారు.